# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 13-10-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరులో నూతన బైపాస్ రోడ్డును ఉపముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ దృశ్యమాధ్యమం ద్వారా ప్రారంభించారు.**

2. **దివ్యాంగులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని విధాలా అండగా ఉంటాయని కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు.**

3. **తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ రాష్ట్ర పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో సమావేశమవుతారు.**

4. **అమరావతిలో క్వాంటం వ్యాలీ ట్విన్ టవర్స్ నిర్మాణానికి మంత్రి పి. నారాయణ శంకుస్థాపన చేశారు.**

==========================

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరులో జాతీయ రహదారి 67 నూతన బైపాస్ రోడ్డును ఉపముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ అమరావతి నుంచి దృశ్యమాధ్యమం ద్వారా ఈరోజు ప్రారంభించారు. ఆత్మకూరులో నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. బైపాస్ రహదారి అందుబాటులోకి రావడంతో ఆత్మకూరులో ట్రాఫిక్ రద్దీ తగ్గడంతో పాటు వాహనదారులకు ప్రయాణం మరింత సులభతరం కానుందని తెలిపారు. రవాణా సౌకర్యాలకు మరిన్ని నిధులు కేటాయిస్తామని రామనారాయణరెడ్డి పేర్కొంటూ,

వాయిస్ ..25... సెకన్లు

--------------------------

పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో కోటి 10 లక్షల రూపాయల నిధులతో 365 మంది దివ్యాంగులకు 540 సహాయ ఉపకరణాలను కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో కలిసి ఈరోజు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధుల ద్వారా ప్రజలకు మేలు చేసే కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. దివ్యాంగులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని విధాలా అండగా ఉంటాయని పేర్కొన్నారు. మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ..

సాంకేతిక కారణాలతో ప్రభుత్వ పింఛన్లు అందని దివ్యాంగులకు సొంత నిధులు, దాతల సహకారంతో ప్రతినెలా ఆర్థిక సాయం అందిస్తున్నామని తెలిపారు.

-------------------------

తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ ఈరోజు రాష్ట్రంలో పర్యటిస్తారు. పర్యటనలో భాగంగా సాయంత్రం విజయవాడ కనకదుర్గమ్మ ఆలయానికి వెళ్లి అమ్మవారిని దర్శించుకుంటారు. అనంతరం అమరావతిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో సమావేశమవుతారు. ఈ సమావేశంలో చెన్నైకి కృష్ణా జలాల సరఫరా, గోదావరి-కృష్ణా-కావేరి నదుల అనుసంధానంపై చర్చించనున్నారు. అనంతరం విజయవాడలోని పున్నమి ఘాట్‌లో నిర్వహించే 'విజయవాడ ఉత్సవ్ 2.0'లో ముఖ్యమంత్రి విజయ్ పాల్గొని ప్రసంగిస్తారు. తర్వాత చెన్నైకి తిరుగు ప్రయాణమవుతారని అధికారులు తెలిపారు.

-------------------------

రాజధాని అమరావతిలోని ఉద్దండరాయునిపాలెంలో క్వాంటం వ్యాలీ ట్విన్ టవర్స్ నిర్మాణానికి పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఈరోజు శంకుస్థాపన చేశారు. మొత్తం 50 ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి చేయనున్న క్వాంటం వ్యాలీ ప్రాజెక్టులో భాగంగా 11 ఎకరాల్లో ఈ భారీ జంట టవర్లను నిర్మించనున్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఈ టవర్లను నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించారు. శంకుస్థాపన అనంతరం మంత్రి నారాయణ పాత్రికేయులతో మాట్లాడుతూ,

వాయిస్..30.. సెకన్లు

-------------------------

భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రేపు, ఎల్లుండి రెండు రోజుల పాటు విజయవాడలో పర్యటించనున్నారు. రేపు సాయంత్రం గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న అనంతరం రాష్ట్రపతి ఇంద్రకీలాద్రిపై శ్రీ కనకదుర్గమ్మను దర్శించుకుంటారు. 15వ తేదీ ఉదయం పున్నమి ఘాట్‌లో నిర్వహించే జాతీయ సరస్ మేళా-2026ను రాష్ట్రపతి లాంఛనంగా ప్రారంభిస్తారు. అనంతరం స్వయం సహాయక సంఘాల సభ్యులు, లఖ్‌పతి దీదీలతో కలిసి విందులో పాల్గొంటారు. మధ్యాహ్నం గన్నవరం విమానాశ్రయం నుంచి ఢిల్లీకి తిరుగు ప్రయాణమవుతారని అధికారులు తెలిపారు. రాష్ట్రపతి పర్యటన సందర్భంగా విజయవాడలో అన్ని శాఖల సమన్వయంతో అధికారులు భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నారు.

-------------------------

అత్యంత నిరుపేద కుటుంబాలను ఆర్థికంగా ఆదుకుని, వారికి జీవనోపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'సమావేశి ఆజీవిక యోజన' కార్యక్రమాన్ని ప్రారంభించిందని పేదరిక నిర్మూలనా శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. దీనదయాళ్ అంత్యోదయ యోజన - జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్ కింద అమలు చేస్తున్న ఈ పథకం ద్వారా రాష్ట్రంలో 10 వేల అత్యంత నిరుపేద కుటుంబాలను పేదరికం నుంచి బయటకు తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వెల్లడించారు. యానాది, చెంచు తెగల జనాభా అధికంగా ఉన్న 26 మండలాల్లోని 650 గ్రామ సంఘాల పరిధిలో అర్హులైన కుటుంబాలను గుర్తిస్తామని మంత్రి తెలిపారు.

-------------------------

ప్రజలకు సేవ చేయడం ద్వారా దేశానికి సేవ చేయాలనే దృఢ సంకల్పంతో, ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రజా సేవలో 25 ఏళ్లు పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రాంతీయ వార్తా విభాగం 'ప్రజా సేవతో దేశ సేవ' పేరుతో ప్రత్యేక కథనాలను అందిస్తోంది. ఇందులో భాగంగా దేశ కార్మిక రంగ సంక్షేమం కోసం తీసుకువచ్చిన కార్మిక చట్టాలు 2025 గురించి ఈ రోజు తెలుసుకుందాం.

29 పాత కేంద్ర కార్మిక చట్టాల స్థానంలో దేశంలో నాలుగు కొత్త కార్మిక చట్టాలు 2025 నవంబర్ 21 నుంచి అమల్లోకి వచ్చాయి. వేతనాలు, పారిశ్రామిక సంబంధాలు, సామాజిక భద్రత, కార్యాలయ భద్రతకు సంబంధించిన 29 కార్మిక చట్టాలను ఈ నాలుగు చట్టాల పరిధిలోకి తీసుకొచ్చారు. దీంతో సంస్థలకు నిబంధనల అమలు సులభతరమై, కార్మికులకు రక్షణ మరింత విస్తరించింది. ప్రతి కార్మికుడికి కనీస వేతనాన్ని చట్టబద్ధమైన హక్కుగా గుర్తించడంతో పాటు, గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికులను కూడా సామాజిక భద్రత పరిధిలోకి తీసుకువచ్చారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి అత్యంత సమగ్రమైన, ప్రగతిశీల కార్మిక ఆధారిత సంస్కరణలలో నాలుగు కొత్త కార్మిక చట్టాలు ఒకటి అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొంటూ,..

వాయిస్..25.. సెకన్లు

-------------------------

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధితో పాటు రైతులకు వ్యవసాయ సేవలు అందించడంలో సహకార సంఘాలు కీలక పాత్ర పోషిస్తాయని రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురంధేశ్వరి తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లి మండలం గౌరీపట్నం గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం భవన నిర్మాణానికి ఆమె శంకుస్థాపన చేశారు. అనంతరం పురంధేశ్వరి మాట్లాడుతూ, కొత్త భవనం అందుబాటులోకి వస్తే రైతులకు వ్యవసాయ సహకార సేవలు మరింత సులభంగా అందనున్నాయని అన్నారు. గ్రామీణ వ్యవసాయ అభివృద్ధికి ఈ భవనం దోహదపడుతుందని పేర్కొన్నారు. రైతుల సంక్షేమం, గ్రామాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యమిస్తున్నాయని తెలిపారు.

-------------------------

అంతర్జాతీయ ప్రకృతి విపత్తుల ప్రభావ నియంత్రణ దినాన్ని ఈరోజు నిర్వహిస్తున్నారు. ప్రకృతి విపత్తుల వల్ల సంభవించే ప్రాణ, ఆస్తి నష్టాలను తగ్గించడంతో పాటు, విపత్తుల పట్ల ప్రజల్లో అవగాహన, అప్రమత్తత పెంపొందించడమే ఈ దినోత్సవ ప్రధాన ఉద్దేశం. ఐక్యరాజ్యసమితి 1989వ సంవత్సరం నుంచి ప్రతి ఏటా అక్టోబర్ 13వ తేదీన ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. దేశంలో విపత్తు నిర్వహణ చట్టం – 2005 ప్రకారం జాతీయ విపత్తు నిర్వహణ విధానాన్ని రూపొందించారు. విపత్తులను సమర్థంగా ఎదుర్కొనేందుకు, వాటి ప్రభావాన్ని తగ్గించేందుకు సమగ్ర వ్యవస్థను అభివృద్ధి చేస్తూ కేంద్ర ప్రభుత్వం విపత్తు నిర్వహణ ప్రణాళికలను అమలు చేస్తోంది.

-------------------------

తిరుమలలో శ్రీ వెంకటేశ్వర స్వామివారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఈ ఉదయం మలయప్ప స్వామివారు చిన్న శేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఐదు తలల శేషవాహనంపై స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. కాగా ఈరోజు రాత్రి ఏడు నుంచి తొమ్మిది గంటల వరకు మలయప్ప స్వామి హంస వాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు.

-----------------------------

శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళిలో శ్రీ కొత్తమ్మతల్లి 101వ వార్షిక జాతర మహోత్సవాలు ఈరోజు ప్రారంభమయ్యాయి. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు, కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని, ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు, సారె సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ, ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వరుసగా మూడోసారి ఈ జాతరను రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నామని చెప్పారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు.

-----------------------------

శ్రీశైలం ప్రాజెక్టుకు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కడం తెలుగు రాష్ట్రాలకి గర్వకారణమని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. విద్యుత్ ఉత్పత్తితో పాటు ప్రజలకు తాగునీరు, రైతులకు సాగునీరు అందిస్తున్న బహుళార్థ సాధక ప్రాజెక్టు శ్రీశైలమని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

======================